# పేరు మీరే పెట్టండి.

అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

విరివిగా దానాలుచేస్తూ 'దానకర్ణుడు' అని కర్ణుడు పేరు తెచ్చుకుంటున్న కాలం అది...

ఏది అడిగినా లేదనకుండా వెంటనే యిచ్చేస్తూ ప్రజల్లో గుడ్ యింప్రెషన్ గెయిన్ చేస్తున్న సమయం అది...

ప్రజలు ఆనందంతో కర్ణుడికి డి.వి.యస్. కర్ణ (దాన వీర శూర కర్ణ) అనే బిరుదు ఇవ్వబోతున్న తరుణం అది...!

ఓ గంట కట్టించి దానికి జస్టిస్ బెల్ (ధర్మగంట) అని పేరుపెట్టి అది మ్రోగించిన మరుక్షణంవచ్చి ఆ గంట కొట్టినవ్యక్తి కోరిక తీరుస్తున్నాడు కర్ణుడు.

కర్ణుడి ఇంటికి జనం కావలసినన్ని కోరికల్తో వస్తున్నారు. కోరికల్ని తీర్చుకుంటున్నారు. ఏ లోటూ లేకుండా ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారు. వాళ్ళ జీవన విధానం ముప్పైపువ్వులు అరవైకాయలుగా ఉంది.

తను చేస్తున్న దానాలగురించి, ప్రజలు తనపై కురిపిస్తున్న పొగడ్తల గురించి ఆలోచిస్తూ...ఏవేవో హెల్యూసినేషన్స్‌లో తేలిపోతున్నాడు.

ఇంతలో ఓ రోజు...

ఎ.సి. ఆన్‌చేసి రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చుని ఏదో ఆలోచిస్తున్న కర్ణుడికి గంట వినిపించింది. కోరికలుతీర్చడమే ధ్యేయంగా పెట్టుకున్న కర్ణుడు బైటికివెళ్ళేడు. ఓ వందమంది దాకా ఉన్నారు. వాళ్ళచేతుల్లో ఏవేవో పాత్రలున్నాయి.

"మీ కోరికలు విపరించెపరా... యధాశక్తి మిమ్మలను శాటిస్‌ఫై చేయుడానికి ట్రై చేయుదును..." వినమ్రతతో అన్నాడు కర్ణుడు. దానికి సమాధానంగా వాళ్ళందరూ వాళ్ళవాళ్ళ చేతుల్లోని పాత్రలు పైకెత్తి "దాహం... దాహం... నీళ్ళు... నీళ్ళు... తాగడానికి నీళ్ళు కావాలి. వుయ్ వాంట్ వాటర్.." అని ముక్త కంఠంతో అన్నారు.

లిప్తపాటు కాలంలో అతని ముఖంమీద భయం నర్తించింది. రెప్పపాటు కాలంలో అతని ముఖం చెమటతో నిండిపోయింది.

"మేం భాగ్యనగరం నుంచి వచ్చేము. కర్ణా!... మా కోర్కె తీర్చుము... ఇఫ్ నాట్-మేం దాహంతో చచ్చుట ఖాయం..." వందమందిలో ఒకతను అన్నాడు.

కర్ణుడు నిలబడిపోయాడు స్థబ్దంగా... స్థాణువులా... తన కాలికింద భూమి తిరిగిపోతున్నట్టు . భూమి రెండుగా చీలుతున్నట్టు అనిపించింది కర్ణుడికి.

నన్ను ఫూల్ చెయ్యడానికి ప్రయత్నమా? కర్ణుడి స్వగతం.

అమృతాంజనం ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లో మొదటి ఫోటోలా పెట్టేడు కర్ణుడుమొహం. ఉడుకుమోత్తనంతో "ఇంపాసిబుల్!" గట్టిగా అరిచాడు.

"...కవచకుండలాలు ఇమ్మంటే నిస్సంకోచంగా తీసిచ్చాను. కుండపోత వర్షంలో నిర్మొహమాటంగా బిల్డింగ్‌లు బద్దలు కొట్టించి ఇచ్చాను... ఈ నీళ్ళ విషయంలో మాత్రం నన్ను వదిలెయ్యండి... ప్లీజ్... ఐ కాంట్ హెల్ప్ యు. అయాం వెరివెరీ సారీ..." అనేసి నిరాశగా వెనుదిరిగేడు కర్ణుడు.

(కేవలం హాస్యం కోసం రాసిందికాని ఇది ఎవరినీ కించబరచడానికి కాదని మనవి నీళ్ళ సమస్యని అనుభవించిన ప్రతి ఒక్కరికీ ఈ కథ అంకితం.)

—గోపరాజు రాధాకృష్ణ
(మోరి)

ఎన్నికైన గెస్ట్ ఎడిటర్ :
శ్రీ గాంధీ



వేలాది కథల్ని పరిశీలించి పదుల్ని ఎంపిక చేయటం 'జ్యోతి' మాస పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ గాంధీగారికి వెన్నతో పెట్టిన విద్య అనే చెప్పాలి. పత్రికారంగంలో ఓ మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకున్న శ్రీగాంధీ, కార్యదక్షుడే కాక, పిన్నవయసులోనే ఓ విశిష్టమైన స్థానాన్ని అధిష్ఠించటం ప్రశంసనీయం!

"ఇంటింటికో రచయిత తయారవుతున్న ఈరోజుల్లో ఉత్తమ కథల్ని ఎంపికచేయటం కష్టమే అయినా- అసాధ్యమైంది కాదు" నవ్వుతూ తన అభిప్రాయం వెలిబుచ్చిన గాంధీ మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నారు. ఇక చదవండి.

# సన్మానం

చేతిలోని అద్దంముక్కలో తన రూపాన్ని సరిచూసుకుని... చుట్టూ చూశాడు ఆనందరావు-

ఆ ఇరుకు గదిలోనే చెరో మూలకూర్చుని ముఖానికి రంగు పులుముకోవడంలో నిమగ్నమై ఉన్నారు మరి కొందరు-

బయట ఓపిక నశిస్తున్న ప్రేక్షకుల ఈలలు, కేకలు కలగాపులగంగా చెవిన పడుతూ ఉంది... ఇంతలో భార్య సత్యవతి ప్రత్యక్షం కావడంతో దారి చేసుకు ఆమెవైపు నడిచాడు ఆనందరావు- ఆడవేషంలోవున్న భర్తవైపు చిలిపిగా చూస్తూ "ఈ నా చీరలో మీరు చాలా బావున్నారండి?" అంది నవ్వుతూ-

అందులో వ్యంగ్యముందో.... విసురుందో గాని భుజాలు తడుముకున్నాడు ఆనందరావు- ఎందుకంటే సత్యవతి నెలరోజులనుండీ పోరుతోంది... వున్న రెండు చీరల్లో ఒకటి మరీ పాతదై చిరుగులు పట్టిందని... వేరొకటి కొనిపెట్టమని...

వేస్తున్న నాటకాల్లో పదో పరకో వస్తే... అది అప్పుడప్పుడూ పై ఖర్చుకే హరించుకుపోతోంది-

ఈ సారి నాటకంలో ఆనందరావుది మధ్యతరగతి స్త్రీ పాత్ర... మిధ్యాడంబరాలకు పోతూ... క్షణం క్షణం భర్తను వేధించుకుతినే పాత్ర... పాత్ర చివర్లో తన బట్టల్ని చింపి, పోగులుచేసి దాన్ని భర్తమీదికి విసిరివేస్తుంది-

ఆ పాత్రకు ఆడవాళ్ళెవరూ అంత గంభీరంగా లేకపోవటంతో ఆనందరావు చేతే ఆ పాత్ర వేయిస్తున్నాడు డ్రామా డైరెక్టరు-

రిహార్సల్స్ చేస్తున్నప్పుడు గుడ్డలుచింపి భర్తమీద పోసే సీన్లో ఆనందరావు చాలా గిల్టీగా ఫీలౌతున్నాడు- బహుశా తన భార్యే ఆ విధంగా చేస్తే తదుపరి పర్యవసానమే మనేది ఆ ఆలోచనేమో-

నాటకం మొదలైంది... ఆనందరావు హావభావ ప్రకటనకు... డైలాగ్ డెలివరీకి... ముగ్ధులై... ప్రతిడైలాగ్‌కి వన్స్ మోర్‌లు... చప్పట్ల రూపంలో రెస్పాన్స్ ఇస్తున్నారు ప్రేక్షకులు-

ఆనందరావు చీరను చింపి, డ్రామాలోని భర్తమీద పోసే సీనది... చీరను ముక్కా ముక్కా చింపుతుంటే... అతని గుండె ఒక్కో ముక్కగా విడిపోతోంది-

నాటకంలో ఆనందరావు పాత్రకు ఉత్తమ నటన బహుమతివచ్చింది- ఆనందరావు శిఖరాగ్ర నటనకు ముగ్ధులైన వారు అతనికి శాలువ కప్పి సన్మానించాలని తీర్మానించి అప్పటికప్పుడు... ఏర్పాట్లు చేశారు-

ఆనందరావును కుర్చీలో కూర్చోపెట్టి శాలువకప్పి, మైకుపుచ్చుకు అతని నటనా ప్రతిమను ఒక్కొక్కరే వచ్చి శ్లాఘించి పోతున్నారు-

ఇదేమీ పట్టని ఆనందరావు మాత్రం తనకు కప్పిన దుశ్శాలువాను ఎంతకు కొంటారో... ఆ డబ్బుతో భార్యకు ఎన్ని చీరలు కొనవచ్చో అంచనా వేసుకుంటున్నాడు... *

—త్యాగప్రభ
(చిత్తూరు)

స్రవంతి నెం: 7లో ఇచ్చిన వాక్యం
"నా చీర మీకు బాగున్నదండి"
అన్నది భర్తతో సత్యవతి.
ఆధారంగా రాసిన కథలు

## సుత్తి... సుత్తి... సుత్తి...

వీరభద్రం చాలా కాలంగా గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు. భార్య సత్యవతి. పిల్లలు లేని ఆ దంపతులకు జీతం సమంగా సరిపోయేది.

వీరభద్రం అంటే ఆఫీసులో అందరికీ అభిమానం. ముభావంగా, గంభీరంగా ఉండి తన పనేదో తాను సిన్సియర్‌గా చేసుకుపోయే వీరభద్రం ఇంటివద్ద పిల్లిలా ఉంటాడు. భార్య చేతిలో కాదు సుమా! మరెవరంటారా అదే వీధిలో ఉన్న హరికథ చెప్పే సుత్తిదాస్.

సుత్తిదాస్, తన పేరును సార్థకం చేసుకొన్న మహానుభావుడు. పిల్లలతో మొదలుకొని, వృద్ధులవరకు అతని బారినుండి తప్పించుకోలేరు.

* * *

భద్రం ఈలవేసుకుంటూ సంతోషంగా వచ్చాడు ఆఫీసునుంచి.

"ఏమిటో హుషారు" ఎదురొచ్చింది సత్యవతి.

"ఒసే పిచ్చిమొద్దూ, ఈ రోజు మన పెళ్ళి రోజుకదే! మల్లెపూలు చాలాతెచ్చాను" సంభ్రమంగా చెప్పాడు. సత్యవతి కళ్ళల్లో ఆనందం చూసి తృప్తిగ నిట్టూర్చాడు భద్రం.

సత్యవతి స్వీట్స్ చేసింది. ఇద్దరూ కలిసి భోంచేశారు భార్య వంటిల్లు సర్దుతుంటే, ఎదురుచూస్తూ వసారాలో కూర్చున్నాడు భద్రం.

ఇంతలో వీధి మలుపు అవతలనుంచి సుత్తిదాస్‌సౌండ్ బిగ్గరగా వినిపించింది.

అంతే! ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు భద్రం. వచ్చేది తనింటికేనని గ్రహించాడు. వస్తే వచ్చినా ఇహ కదలడు. మరి తమ రాత్రి!

హఠాత్తుగా మంచి ఐడియా తట్టింది. వెంటనే లోనికెళ్ళి భార్యకి విషయం చెప్పి, గబగబా చీరకట్టుకొని పంటింటి గోడకానుకొని పడుకున్నాడు.

సుత్తి దాసు నశ్యంపొడి ఎగబీలుస్తూ "భద్రం! భద్రంగున్నావా" అంటూ లోనికొచ్చాడు.

"వారులేరు దాస్‌గారూ, ఊరెళ్ళారు" ఎదురొచ్చింది సత్యవతి.

"సరే! రేపొస్తాలే,
అనేసి వెనుతిరిగాడు.

తలుపేసి తిరిగొచ్చింది సత్యవతి. భద్రం ఎగిరి గంతేసినంతా పనిచేశాడు.

"నా చీర మీకు బాగున్నదండి" అన్నది భర్తతో సత్యవతి. పగలబడి నవ్వసాగింది.

చీరను అవతల విసిరేసి "రావే నా భామా! ముద్దుల గుమ్మా!" అంటూ ముద్దెట్టుకునేలోగా తలుపు దబదబా కొట్టుకుంది.

సత్యవతి వెళ్ళి తలుపు తీసింది. 'హాచ్' అని తుమ్ముతూ లోనికొచ్చాడు. సుత్తిదాస్, భద్రం తేలుకుట్టిన దొంగలా అయిపోయాడు.

"నే ననుకున్నా భద్రం లోనే ఉంటాడని" నేరస్తుణ్ని, జడ్జి అనే ధోరణిలో అని బాసింపట్టేసి కూర్చున్నాడు. "అరణ్య పర్వంలో ఒక మాంచి ఘట్టముంది. అదేమంటే... అలనాడు రాముడు..."

ఇక ఆ దంపతులను రక్షించడం దేవునికైనా అసాధ్యం! *

—పి. రవీంద్రనాథరెడ్డి
(గుంటూరు)

## ఓ కథ రాయండి

ఈ కింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్థమైన కథా రచయితలకి పాతికరూపాయలు పారితోషకం పంపబడుతుంది.

"మీకేం, పెళ్ళయిన ఆరునెలలకే తండ్రయ్యారు. నేను రెండేళ్ళయినా తల్లి కాలేకపోతున్నాను" అన్నది భర్తతో రాజ్యం.

'ఓ కథ రాయండి'
స్రవంతి వారపత్రిక.
6-3-1099/2 రాజ్‌భవన్‌రోడ్,
సోమాజిగూడ, హైదరాబాద్-500 482.